# కాంగ్రెస్‌లో చిచ్చు

- ఇప్పటికే ఆదిలాబాద్‌లో కీలకనేతల రాజీనామా
- బోథ్ అభ్యర్థి మార్పు విషయంలో తుడుందెబ్బ ఆందోళన
- రేవంత్ టికెట్లమ్ముకున్నారని మండిపాటు
- టీపీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం
- ఆదివాసీలకు ద్రోహం చేశారని ఆవేదన
- కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరిక

ఆదిలాబాద్, నవంబరు 7 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ టికెట్ల లొల్లి రోజు రోజుకూ ముదురుతున్నది. ఆదిలాబాద్ నియోజకవర్గం టికెట్‌ను కంది శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చినందుకు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి రాజీనామా చేశారు. బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా రెండో జాబితాలో వన్నెల అశోక్ పేరును ప్రకటించగా సోమవారం ఆయనను కాదని ఆడే గజేందర్‌కు మార్చారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసులు ఆందోళనబాట పట్టారు. ఆదిలాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.70 లక్షల జనాభా ఉన్న ఆదివాసులను కాంగ్రెస్ పార్టీ అవమానపర్చిందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మండిపట్టారు. ఆదివాసులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాలో రెండు ఎస్టీ నియోజకవర్గాల్లో రెండు ఆదివాసులకు ఇస్తామని చెప్పారని, బోథ్ టికెట్ అభ్యర్థిగా ఆదివాసీ గిరిజనుడైన వన్నెల అశోక్‌కు ఇచ్చి ఎందుకు మార్చాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని గోడం గణేశ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను ఓడించడానికి ఆదివాసులు ఏకమవుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఖతం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి కోట్లాది రూపాయలను దండుకొని టికెట్లు కేటాయించారని ఆరోపించారు. ఆయన కారణంగా కాంగ్రెస్ భారీ మూల్యం చేయించుకోవాల్సి వస్తుందన్నారు. తెలంగాణలో ఆదివాసీలతో పాటు అందరూ కాంగ్రెస్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నేడు ఆదిలాబాద్ ఎన్నికల ప్రచారానికి రానున్న రేవంత్ రెడ్డిని అడ్డుకుంటామని ఆదివాసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆందోళనలో జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళ సంఘం అధ్యక్షురాలు గోడం రేణుక, నాయకులు అశోక్, ఆత్రం గణపతి, ఆతం భారత్, ముకుంద్ పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఖోఖో విజేత ఆదిలాబాద్




సమావేశంలో మాట్లాడుతున్న డీడీ దిలీప్

ఉట్నూర్, నవంబర్ 7: మండలంలోని కేబీ కాంప్లెక్స్‌లో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల మధ్య ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీలో ఫైనల్‌లో ఆసిఫాబాద్ జట్టుపై 12–6 తేడాతో ఆదిలాబాద్ జిల్లా జట్టు గెలుపొందింది. అంతకుముందు ఐటీడీఏ డీడీ దిలీప్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీడీ మాట్లాడుతూ, ఖోఖో పోటీల్లో మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభావంతులను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేవిధంగా క్రీడాకారులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఆశ్రమ పాఠశాలలో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా అండర్ 14 విభాగంలో సబ్ జూనియర్ బాలురు ఖోఖో జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంతో జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారధి, ఏటీడీఓ క్రాంతి, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యాయులు ఉత్తం, హేమంత్, రవీందర్, సిబ్బంది గోవింద్, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కడెం, నవంబర్ 7: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన పెంద్రం మోహన్, ఆత్రం భీంరావు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సౌదాని వెంకటరమణ యాదవ్ మంగళవారం పరామర్శించి, బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు, నగదు అందజేశారు. ఈ ప్రమాదంలో గాయాలతో నిర్మల్‌లో చికిత్స పొందుతున్న మరో వ్యక్తిని పరామర్శించారు. తుడుందెబ్బ ఉపాధ్యక్షుడు రవి, అజ్మీరా రాజేశ్‌నాయక్, తిరుపతినాయక్, వెడ్మ దేవేందర్, అర్క శ్రీనివాస్, ఆనంద్, లింబారావు, మొగిలి, ప్రవీన్, తదితరులున్నారు.

**ఫౌండేషన్ సభ్యుల ఆర్థిక సహాయం**

కడెం, నవంబర్ 7: మండలంలోని పాండ్వాపూర్ తండా గ్రామానికి చెందిన అజ్మీరా నరేశ్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం జై జవాన్–జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి, రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. బుగ్గారం లింగన్న, దావనపెల్లి రాజశేఖర్, పెట్టెం నరేశ్, పాకవేణి మల్లేశ్, గోపు వినోద్, అప్పని వసంత్, రవి, ఉత్తర్, రామరావు, తదితరులున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

సోన్, నవంబర్ 7: నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో అక్రమంగా గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు నిర్మల్ రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. హైదరాబాద్‌లోని శామిర్‌పేట్‌కు చెందిన ఇద్దరు దేవేందర్, రాహుల్ మల్లేశ్ చౌదరిలు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎఎస్సై దేవన్న, సిబ్బంది అనిల్, సంతోశ్‌తో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. గుడిహత్నూర్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయించేందుకు వస్తున్నట్లు నేరాస్తులు ఒప్పుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా గంజాయిని పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అభినందించారు.

# కొనసాగుతున్న నామినేషన్లు

- బోథ్‌లో నామినేషన్లు రాలేదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం/బోథ్,నవంబర్7: ఆదిలాబాద్ శాసన సభ నియోజకవర్గానికి 1 నామినేషన్ రాగా , బోథ్‌కు నామినేషన్ రాలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం ఆయా రిటర్నింగ్ అధికారులు కార్యాలయాల్లో సంబంధిత ఆర్‌వోలు నామినేషన్‌లను స్వీకరించారు. కౌంటర నంబర్1 వద్ద నామినేషన్ల దరఖాస్తు పత్రాలు లభిస్తాయి, 2 కౌంటర్ వద్ద సహాయ కేంద్రంలో వివరాలను పరిశీలించుకొని రిటర్నింగ్ అధికారికి అందజేయవచ్చని తెలిపారు. ఆదిలాబాద్‌కు స్వతంత్ర అభ్యర్థి ముండే ప్రవీ ణ్ కుమార్ నామినేషన్ దాఖాలు చేశారు. ఈ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారులు బి. స్రవంతి చాహాత్ బాజ్‌పాయ్,అధికారులు సిబ్బంది ఉన్నారు.

**• ముథోల్‌లో రెండు నామినేషన్లు**

ముథోల్, నవంబర్, 7 : ముథోల్‌లో అసెంబ్లీ స్థానాలకు మంగళవారం రెండు నామినేషన్‌లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థి కాసారం రాజు, కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్ తరపున అతని కొడుకు అఖిలేష్ నామినేషన్‌లను దాఖలు చేసినట్లు వివరించారు.

**• ఐదో రోజూ నామినేషన్లు నిల్**

నిర్మల్ టౌన్, నవంబర్ 7: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐదో రోజైన మంగళవారం నామినేషన్లు ఒక్కటి కూడా దాఖలు కాలేదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ నిర్వహిస్తుండగా అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయడానికి రాలేదు. ఇప్పటివరకు నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

## గంజాయి మొక్కల స్వాధీనం



గంజాయి పంటను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

సారంగాపూర్ నవంబర్ 7 : మండలంలోని ఇప్ప చెలమ్మ గ్రామ శివారులో పోట్యా గ్రామంలో రాజేశ్ అనే వ్యక్తి అక్రమంగా తన పత్తి చేనులో పండిస్తున్న 115 గంజాయి మొక్కలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్లో వీటి విలువ రూ.11,50000మ లు ఉంటుందని ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ రంగస్వామి,ఆదిలాబాద్ నిఘా సీఐ రాకేశ్, ఎస్ఐ కృష్ణ సాగర్,ఎక్సైజ్ ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు డా. కిరణ్ కొమ్రెవార్ రాజీనామా



మాట్లాడుతున్న డా. కిరణ్ కొమ్రెవార్

భైంసా, నవంబర్ 7 : గత ఆరు నెలలుగా కాంగ్రెస్ జెండా మోసిన తనకు కాంగ్రెస్ మోసం చేసిందని, టికెట్ ఇస్తారని ఎంతో ఆశతో ఎదురుచూశానని, నిన్నగాక మొన్న కాంగ్రెస్‌లో చేరిన నారాయణరావు పటేల్‌కు టికెట్ ఇవ్వడపై అసంతృప్తికి గురై పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు డా. కిరణ్ కొమ్రెవార్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం సమయంలో హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నానని ఆయన తెలిపారు. ఈయన వెంట మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, పడకంటి రమాదేవి, అనుచరులు ఉన్నారు.

**• కాంగ్రెస్ జెండాలను కాల్చేసిన అనుచరులు**

భైంసా, నవంబర్, 7 : ముథోల్ టికెట్ కాంగ్రెస్ నారాయణరావు పటేల్‌కు కేటాయించడంతో డా. కిరణ్ కొమ్రెవార్ అనుచరులు మంగళవారం పార్టీ కార్యాలయం ముందు కాంగ్రెస్ జెండాను తగలబెట్టారు. అంతేగాకుండా ఫ్లెక్సీలను సైతం చించేసి కాంగ్రెస్‌కి రాజీనామా చేశారు. ఇందులో దేవిదాస్, డా. కిరణ్ కొమ్రెవార్ అనుచరులు ఉన్నారు.

**• కాంగ్రెస్ తప్పు చేసింది : వన్యాల అశోక్**

తాంసి, నవంబర్ 7 : కాంగ్రెస్ అధిష్ఠానం ఎంత పెద్ద తప్పు చేసిందో డిసెంబర్ మూడో తేదీన తెలుస్తుందని టీపీసీసీ కార్యవర్గ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అశోక్‌ను తప్పించి ఇతరులకు టికెట్ కేటాయించడంతో తాంసిలోని ఆయన నివాసంలో ఆ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. వ్యక్తిగత రాజకీయాల కోసం తనను కావాలనే తప్పించారని అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, మండల నాయకులు సంతోశ్, లక్ష్మిపతి, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలను చించివేస్తున్న డా. కిరణ్ కొమ్రెవార్ అనుచరులు

**• ఆదివాసీలకు కాంగ్రెస్ అన్యాయం..**

ఉట్నూర్, నవంబర్ 7: ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని నాయక్‌పోడ్ సేవా సం ఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆశరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భోథ్ నియోజకవర్గంలో మొదటగా ఆదివాసీ గిరిజనుడైన వెన్నెల అశోక్‌కు కాంగ్రెస్ టికెట్ కేటాయించి అనంతరం లంబాడ గిరిజనులకు మళ్లీ టికెట్ కేటాయించడం ఎంత వరకు సమజసమన్నారు. కాం గ్రెస్ తమను కించపర్చిందన్నారు. ఈ ఎన్నిల్లో కాం గ్రెస్‌కి తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమలో లమృత్, ప్రశాంత్ పాల్గొన్నారు.



తాంసి: పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు అశోక్